క్లుప్తంగా

అమ్మ ఒడి మంజూరు

దెందులూరు: పాఠశాల విద్యార్థినికి అమ్మ ఒడి మంజూరు చేయించిన మండల విద్యాశాఖాధికారి కే.అన్నమ్మ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తుల మన్ననలు పొందారు. కొవ్వలిలో సాల్వేషన్ ఆర్మీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని బూసి ధనశ్రీకి అమ్మ ఒడి సొమ్ము మంజూరు కాలేదు. ధనశ్రీ తల్లి సునీత స్పందనలో ఫిర్యాదు చేయగా దెందులూరు ఎంఈవో కే. అన్నమ్మ విద్యాశాఖ ఉన్నతాధికారులతో దీనిపై మాట్లాడారు. దీంతో ధనశ్రీకి అమ్మ ఒడి నగదు రూ. 13 వేలు మంజూరైంది. ఆ నగదును హెచ్ఎం సీహెచ్ ఏసుదాసు, ఎంఈవో అన్నమ్మ శుక్రవారం విద్యార్థిని తల్లికి పాఠశాలలో అందజేశారు. ఎంఈఓను సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ కే.సుబ్బారావు, హెచ్ఎం ఏసుదాసు, తల్లి సునీత, గ్రామస్తులు అభినందించారు.

గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

భీమడోలు: భీమడోలు జంక్షన్‌లో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్న బిర్యానీ పాయింట్ దుకాణంపై శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడి చేసారు. విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బిర్యానీ పాయింట్‌లో గృహావసరాలకు వినియోగించే ఐదు గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని గోపాల్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. దుకాణం యాజమాని షేక్ మున్నాపై కేసు నమోదు చేసారు. సీఎస్‌డీటీ ఏ.మాధవరావు, వీఆర్వోలు వెజ్జు వినయ్‌కుమార్, మార్కేండేయులు పాల్గొన్నారు.

గృహసారథులకు బీమా

దెందులూరు: గృహసారథులకు బీమా కల్పన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టికి నిబద్ధతకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు అన్నారు. శుక్రవారం దెందులూరు ఆయన నివాసంలో దెందులూరు, అలుగులగూడెం, అప్పారావుపాలెం, సత్యనారాయణపురంలో 105 మంది గృహసారథులకు వైఎస్సార్ సీపీ తరపున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ఒక్కొక్కరికీ రూ.10 లక్షల బీమా నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తం 136 మందికి బీమా నమోదు కార్యక్రమం చేయాల్సి ఉందని, శుక్రవారం సాయంత్రానికి 105 మంది గృహసారథులకు బీమా నమోదు చేశామని పోకల రాంబాబు అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్లు ఐనంపూడి రాము, దనికొండ దుర్గారావు, గృహ సారథి మెరపల రంగారావు ఉన్నారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

దెందులూరు: ప్రభుత్వ లక్ష్యాల సాధనకు, విద్యాభివృద్ధికి, నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని దెందులూరు ఎంఈవో కే.అన్నమ్మ అన్నారు. శుక్రవారం దెందులూరు సెయింట్ మెరిస్ యూపీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల పేర్ల నమోదు, చైల్డ్ ఇన్ఫో పనితీరును అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, రికార్డులు పరిశీలించారు. హెచ్ఎం టీనామరియా, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

ఉంగుటూరు: స్థానిక పాతూరి కమ్మ కళ్యాణ మండపంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వాసుబాబు చేతుల మీదుగా శనివారం పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో ఆంజనేయులు తెలిపారు. 614 మందికి పింఛన్లు నూతనంగా మంజూరయ్యాయని ఆయన చెప్పారు.

బాలలకు అందుబాటులో సార్వత్రిక విద్య

గణపవరం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పాఠశాలలో నమోదు చేసిన విద్యార్థులకు పరీక్ష ఫీజు, ఇతర రుసుములను ప్రభుత్వమే భరిస్తుందని ఈ అవకాశాన్ని మధ్యలో చదువు మానేసిన విద్యార్థులంతా వినియోగించుకోవాలని గణపవరం ఎంఈవోలు పుచ్చల శేష, గొర్రెల బాలయ్య అన్నారు. బడిబయట ఉన్న పిల్లల నమోదులో గణపవరం మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. శుక్రవారం గణపవరం మండలంలో బడిబయట ఉన్న 16నుంచి 18 ఏళ్లలోపు వయస్సు ఉన్న పిల్లలను ఓపెన్ స్కూల్లో చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మండలంలో 32 మంది బడి బయట ఉన్న పిల్లలను గుర్తించామన్నారు. శుక్రవారం 10 విద్యార్థులను ఓపెన్ స్కూల్లో చేర్పించారు. జల్లికొమ్మరలోనే అధికంగా ఐదుగురిని పాఠశాలలో చేర్పించినట్టు ఎంఈవోలు తెలిపారు.

ఇంజనీర్లు నవ భారత నిర్మాతలు

గణపవరం: ఇంజనీర్లు నవభారత నిర్మాతలని లయన్స్ జిల్లా చైర్మన్లు కె.సత్యనారాయణ, కిలారి రవిబాబు అన్నారు. శుక్రవారం ఇంజనీర్స్ డే సందర్భంగా గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గణపవరం, నిడమర్రు మండలాల్లోని ఇంజనీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా వారు వివిధ శాఖలకు చెందిన ఇంజనీరింగ్ అధికారులను దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రావూరి నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

గణపవరం: పోషకాహార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ముప్పర్తిపాడులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పోషకారం, ఆరోగ్యకర నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి రాధాలక్ష్మి శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణిలు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పంచాయతీ సభ్యులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా పని చేస్తుందని భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖతో పాటు వివిధ శాఖల అధికారులతో శుక్రవారం అగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ కనమాల రామయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. ఇప్పటికే పేదలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ఆసుపత్రులను ఆధునీకరించారని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. మరో అడుగు ముందుకు వేస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఈనెల 30వ తేదీ నుంచి ఐదు దశల్లో అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ప్రతి పేద వాడికి ఆరోగ్యభరోసా కల్పిస్తుంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారి కోసం వలంటీర్, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలతో ఇంటింటికీ వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు సర్వే చేస్తామన్నారు. ఈ సర్వేలో ప్రతి పౌరుని ఆరోగ్య పరిస్థితిని నమోదు చేయాలన్నారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి, విజయవంతం చేసేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి మాట్లాడుతూ మండలంలోని 2 బృందాలు ఈనెల 30 నుంచి అక్టోబర్ 24వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని వైద్య ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీ, ఉపాధ్యాయులు తమ పరిధిలోని ప్రతి ఒక్కరికీ ఈ పథకంపై అవగాహన కల్పించి వారిని శిబిరాలకు వచ్చే విధంగా తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు ముళ్లగిరి జాన్సన్, గంటా శ్రీనివాసరావు, ఇంజేటి జూనియర్, దాసరి విజయ భాను, సర్పంచులు దాయం సుజాత ప్రసాద్, గుడివాడ నాగగౌతమి సీతారామాంజనేయులు, సచివాలయ గ్రామకార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ కనమాల రామయ్య



ఇంజనీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి తదితరులు

జగనన్న ఆరోగ్య సురక్షతో వైద్య సేవలు

ఉంగుటూరు: జగనన్న ఆరోగ్య సురక్ష జయప్రదం అయ్యేలా అందరూ కృషి చేయాలని ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి కోరారు. శుక్రవారం ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలు, మెడికల్ హెల్త్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ప్రజా ఆరోగ్యం కోసం సీఎం జగన్ వేలకోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వైసీపీ సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ మాట్లాడుతూ 3,257 జబ్బులు ఆరోగ్యశ్రీలో పొందుపర్చిన మహోన్నతుడు సీఎం జగన్ అని అన్నారు. నాడే- నేడులో ఆస్పత్రులను అభివృద్ధి చేశారని అన్నారు. చేబ్రోలు పీహెసీ డాక్టరు, సిబ్బంది జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వచ్చి పరీక్షలు చేస్తారని, రోగులను గుర్తించి ఆ గ్రామంలో నిర్వహించే వైద్యశిబిరానికి తీసుకెళ్లి వైద్య సేవలు, మందులు అందిస్తారని అన్నారు. వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళతారని వివరించారు. జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ఆంజనేయులు, పలువురు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. ఇదే సమావేశంలో ఇంజనీర్స్ డే సందర్భంగా హౌసింగు ఏఈ సురేష్‌బాబు, ఉంగుటూరు ఇంజనీరు సహాయకలు రాయి రాజేష్, దేవదాసు మనీషను ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు కలిసి సత్కరించారు.

ఐదు వైద్య కళాశాలలు ఒకేసారి ప్రారంభం సువర్ణాధ్యాయం



ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి (ఫైల్)

దెందులూరు: ఆంధ్రప్రదేశ్‌లో ఒకేసారి ఐదు వైద్య కళాశాలలను ప్రారంభించి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు, విజయనగరం, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాలలో వైద్య కళాశాలలు ప్రారంభించి రాష్ట్రంలో వైద్యవిద్యను పొందాలనుకునే విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు, ప్రజలకు ముఖ్యమంత్రి ఎంతో మేలు చేశారని ఎమ్మెల్యే అన్నారు. ఏలూరులో మెడికల్ కళాశాల ఏర్పాటు వల్ల అనేక దశాబ్దాలుగా ఉన్న కల నెరవేరిందని, ఎన్నో ప్రభుత్వాలు సాధించినలేని ఘనత ఇప్పుడు సాధ్యమైందన్నారు. రూ. 60 కోట్ల వ్యయంతో సర్వహంగులతో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో వైద్యకళాశాల భవనాన్ని నిర్మించడం హర్షణీయమన్నారు. భవనాన్ని జీ ప్లస్-2గా అత్యాధునిక కార్పొరేట్ హంగులతో తీర్చిదిద్దారని తెలిపారు. అత్యాధునిక ల్యాబ్‌లు, అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పుడు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిందని అన్నారు. ఏలూరులోని వైద్య కళాశాలలో ప్రజలు అన్ని రకాల వైద్య చికిత్సలు పొందవచ్చని, ఇంతటి అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి అర్జీ పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

భీమడోలు: జగనన్నకు చెబుదాం, స్పందన ఆర్జీల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారిస్తుందని భీమడోలు మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ పి.విజయరాజు అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో మండల స్థాయిలో స్పందన అర్జీలు, జగనన్నకు చెబుదాం ఫిర్యాదుల పరిష్కారం, ప్రభుత్వ భవనాల పురోగతి, నాడు నేడు పథకంలో భవన నిర్మాణాలు తదితర అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి హాజరు కాని సంబంధిత అధికారులపై నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోకు సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రత్యేకాధికారి పి.విజయరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆర్జీపై వారం రోజుల్లో సంతృప్తికరమైన పరిష్కారం చూడాల్సిన బాధ్యత గ్రామ కార్యదర్శులు, సంబంధిత అధికారులపై ఉందన్నారు. మండలంలో నెల రోజుల్లో 362 స్పందన ఫిర్యాదులు, 1902కు ఫోన్ చేసిన ఫిర్యాదులు నమోదు కాగా వాటిలో 280 పరిష్కరించి 77శాతం సాధించామన్నారు. పరిష్కరించిన ఫిర్యాదులు, సమస్యలు మరలా వస్తే సంబంధిత సిబ్బందే బాధ్యత అన్నారు. మండలంలో డ్రాపవుట్స్ లేని మండలంగా తీర్చిదిద్దేందుకు వెల్ఫేర్ అసిస్టెంట్లు, విద్యాశాఖ సిబ్బంది తగు కృషి చేయాలన్నారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని సూచించారు. ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని, సంబంధిత వలంటీర్లు, ఏఎన్ఎంలు బృందాలుగా ప్రతి ఇంటికీ వెళ్లి వారికి ఆరోగ్యం పరిస్థితిపై సర్వే చేయాలన్నారు. రోగులను ఆరోగ్య శిబిరాలకు తీసుకుని రావాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తరహాలోనే ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలన్నారు. ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీవో కేవీ విజయలక్ష్మీ, ఏఈలు సతీష్, సుబ్రహ్మణ్యం, గ్రామకార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



భీమడోలులో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి పి.విజయరాజు

ప్రజారోగ్యానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యత



జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలను విడుదల చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్

పెదపాడు: ప్రజారోగ్యానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యనిస్తూ, వారి ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెదపాడు మండల ప్రత్యేక అధికారి, డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం పెదపాడు మండలంలోని ఆరోగ్యశాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరి ఆరోగ్యం వివరాలు తెలుసుకుని, రోగులను గుర్తించి వైద్యం అందించేందుకే ఈ పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఎంపీడీవో ఎస్ నిర్మల జ్యోతి, ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి, డీవీ రమణ, డాక్టరు పాల్, సీడీపీవో విజయలక్ష్మి, ఈఓ పీఆర్డీ సూర్యకుమార్, ఆరోగ్య సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


పశు వైద్యుల సేవలు ప్రశంసనీయం

భీమడోలు: మూగజీవులకు సేవలందించడమే లక్ష్యంగా పని చేస్తున్న పశు వైద్యులు, సిబ్బంది సేవలు ప్రశంసనీయమని పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ జి.నెహ్రూబాబు అన్నారు. భీమడోలు పశుసంవర్ధక శాఖ భీమడోలు సబ్ డివిజన్ సహాయ డైరెక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో వివిధ హోదాల్లో ఉత్తమ సేవలందిస్తున్న 125 మంది వైద్యాధికారులు, సిబ్బందికి విశిష్ట సేవా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోత్సవ కార్యక్రమానికి ఏడీ ఇక్కుర్తి సాయి రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ జి.నెహ్రూబాబు మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తున్న పథకాలను వారికి చేరవేడంతో పాటు మూగజీవాల సంక్షేమమే లక్ష్యంగా పశుసంవర్ధక శాఖ వైద్యాధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలు మరువలేనిదన్నారు. విధి నిర్వహణతో అంకితభావం, నిబద్ధత కలిగిన ఉద్యోగులు వల్ల శాఖకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ పురస్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల అభ్యున్నతికి అనేక పథకాలను అమలు చేస్తోందని, ఆ పథకాలను రైతులకు చేరవేసేలా తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏడీ సాయి రమేష్‌ను, జిల్లా జేడీ జి.నెహ్రూబాబును సత్కరించారు. ఉత్తమ సేవలను అందించిన వైద్యులు, సిబ్బందిని దుశ్శాలువాలతో సత్కరించి వారికి జ్ఞాపికలు అందించారు. డీడీ డాక్టర్ పి.రంగనాథ్, ఏడీలు కె.శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, వైద్యులు, సచివాలయంలో గ్రామ వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



భీమడోలు ఏడీ సాయి రమేష్‌ను సత్కరిస్తున్న జిల్లా జేడీ నెహ్రూబాబు

మండల స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



దెందులూరు మండల పోటీలకు ఎంపికైన జట్టు


దెందులూరు: క్రీడలు శారీరక, మానసిక పటిష్టత దోహదం చేస్తాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ దెందులూరు మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం కొవ్వలి ఉన్నత పాఠశాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రాలో భాగంగా అండర్-14, 17 బాలుర, బాలికల ఆటల పోటీలు నిర్వహించారు. 100 మీటర్లు, 200 మీటర్లు, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్, జావిలెన్ త్రో విభాగాల్లో మండలంలో వివిధ గ్రామాల నుంచి 500 మంది పాల్గొన్నారు. మండల స్థాయి పోటీలకు వివిధ విభాగాల్లో 50 మంది ఎంపికయ్యారని, హెచ్ఎం ఎస్ఎల్ఎస్‌పీజీ శర్మ అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు రవిబాబు, రాధ, రాజేష్, పార్థసారధి సహాయ సహకారాలు అందించారు. మండలస్థాయి పోటీల నిర్వహణ వివరాలు త్వరలో తెలియజేస్తామని జిల్లా జాయింట్ సెక్రటరీ ఎం.కృష్ణారావు వివరించారు. అనంతరం 8 విభాగాల్లో మండల స్థాయికి ఎంపికైన వివిధ పాఠశాలల విద్యార్థులను హెచ్ఎం శర్మ, మండల కోఆర్డినేటర్ సురేష్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

కైకరం హైస్కూలు నుంచి 100 మంది ఎంపిక

ఉంగుటూరు: ఈనెల 13, 14 తేదీల్లో మండలస్థాయిలో నిర్వహించిన వివిధ రకాల క్రీడా పోటీల్లో 100 మంది విద్యార్థులు కైకరం హైస్కూలు నుంచి ఎంపికయ్యారు. వీరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. శిక్షణనిచ్చిన పీడీలు జి.నాగసుధ, ఇ.పాపాయమ్మను, విద్యార్థులను పేరెంట్స్ కమిటీ సభ్యులు, హెచ్ఎం అభినందించారు.

కొవ్వలిలో డెంగీపై అవగాహన ర్యాలీ

దెందులూరు: వర్షాకాలంలో తేమ వాతావరణం వల్ల వైరస్‌లు ఉత్తేజంగా ఉంటాయని, దీంతో జ్వరాలు విజృంభించే అవకాశం ఎక్కువని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు అన్నారు. ఎవరికైనా జ్వరం గుర్తించిన వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు. శుక్రవారం కొవ్వలిలో వైరల్ జ్వరాలపై వైద్య సిబ్బందితో కలిసి కొవ్వలి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల వృద్ధి కారణంగా డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు వ్యాపి స్తాయని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించాలని అన్నారు. ఎంపీహెచ్ఈఓ నాగరాజు, పీహెచ్ఎన్ అరుంధతీ, ఎంపీహెచ్ఈసీ హరిబాబు, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఉన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్యసిబ్బంది

మోక్షగుండం దేశానికి స్ఫూర్తి ప్రదాత

దెందులూరు: ఇంజనీర్ పితామహుడు, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారతావనికి స్ఫూర్తిప్రదాత అని యువ ఇంజనీర్లు ఆయన బాటలో పయనించాలని బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. శుక్రవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నర్సింగ్ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల నిర్వహణకు పోలీస్ అనుమతి తీసుకోవాలి

భీమడోలు: వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు విధిగా పోలీస్ అనుమతులు తీసుకోవాలని భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ శుక్రవారం కోరారు. ఈనెల 18వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో కమిటీ నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్ నుంచి అనుమతులు పొందాలన్నారు. ఈనెల 17వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనుమతి పొందగోరే నిర్వాహకులు తమ దరఖాస్తులో కమిటీ వారి వివరాలు, రోజువారీ కార్యక్రమాలు, నిమజ్జనం నిర్వహించే రూటు వివరాలను పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకునేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

విద్యుత్ ఏఈకి సత్కారం

ఉంగుటూరు: విద్యుత్ ఏఈ శ్రీరామ్‌ను లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఇంజనీరింగ్ డే సందర్భంగా శుక్రవారం సత్కరించారు. నారాయణపురంలో శ్రీరామ్ ఇంటికి లయన్స్ క్లబ్ ఆఫ్ చేబ్రోలు అధ్యక్షురాలు అడపా శోబారాణి, గుణ్ణం బుల్లబ్బాయి, రామిరెడ్డి రామిరెడ్డి, తదితరులు వెళ్లి ఆయనకు శాలువా కప్పి సత్కరించారు.

సాల్మన్‌రాజు మృతి కార్మిక లోకానికి తీరని లోటు

భీమడోలు: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిత్యం కృషి చేసిన సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.సాల్మన్‌రాజు మృతి కార్మిక లోకానికి తీరని లోటని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ అన్నారు. భీమడోలులో సాల్మన్‌రాజు భౌతిక కాయంపై శుక్రవారం వారు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, కె.విజయలక్ష్మీ, గోపిలు, కేవీపీఎస్ మండల కన్వీనర్ టి.సుమన్ బాబు నివాళులర్పించారు.

రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతకు సత్కారం

ఉంగుటూరు: రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు అల్లు శ్రీను అభినందనీయులని ఉప్పాకపాడు గ్రామస్తులు, నెయ్యల సంఘం సభ్యులు అన్నారు.శుక్రవారం అల్లుశ్రీనును గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. శ్రీను పాఠశాల అభివృద్ధికి సహకరించిన విధానం ఎవరూ మరవలేమని వారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ నెయ్యిల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పూలసారి చిన్నబ్బాయి, ఉపాధ్యక్షుడు వంబరిల్లి ఫణీంద్ర, సెక్రటరీ దుర్గారపు నాగరాజు, కోశాధికారి వంబరిల్లి రామాంజనేయులు, పీసీ కమిటీ చైర్మన్ వంబరిల్లి రామకృష్ణ, పాటూర్తి సుబ్రహమణ్యం పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు

దెందులూరు: నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో శనివారం కొవ్వలిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఏలూరు జోనల్ కోఆర్డినేటర్ డీ.రజిత అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో శారీరక, మానసిక దుష్ప్రభావాలు, సమాజంలో జరిగే అనర్థాలు, యువతపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని వైద్యులు, అతిథులు వివరిస్తారని రజిత పేర్కొన్నారు.

బాలల రక్షణకు సహాయ వాణి 1098

పెదవేగి : బాలలు ఆపదలో ఉంటే సహాయ వాణి 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సోషల్ వర్కర్ పి మమతాశ్రీ అన్నారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి, జిల్లా బాలల సంరక్షణ యూనిట్ అధికారి సీహెచ్ సూర్య చక్రవేణి ఆదేశాలతో పాఠశాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. విజయరాయి జెడ్పీ ఉన్నత పాఠశాలోబాలల హక్కులు, చట్టాలు, సంక్షేమ పథకాలు, దిశ వన్ స్టాప్ సెంటర్‌లో అందిస్తున్న సేవలను విద్యార్థులకు వివరించారు. దిశ కౌన్సిలర్ ధనలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి పి. సునీత, హెచ్ఎం యంవీ రమణ పాల్గొన్నారు.